## నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్ : ఆర్టీసీ మియాపూర్‌–2 డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటు నిజాంపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసు, సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వ వచ్చన్నారు. శుక్రవారం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో 9959226420 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## నేడు, రేపు ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సమావేశాలు

మియాపూర్ : మియాపూర్ ముజాఫర్ అహ్మద్ కాలనీలో 29, 30వ తేదీల్లో రెండు రోజుల పాటు ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు. రాష్ట్రం, దేశంలో జరుగుతున్న పరిణామాలతో పాటు రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు, ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు అండగా నిర్మాణ్ ఆర్గనైజేషన్

గచ్చిబౌలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు మాదాపూర్‌లోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ కృషి చేస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.దీంతో ఎంబీఏ, ఎంకామ్, ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు నైపుణ్యాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడానికి చొరవ చూపాలని నిర్ణయించారు. ఏపీఎస్‌ఎ స్డీసీ సీఈఓ గణేష్‌కుమార్, ఏపీఎస్‌ఆర్‌టీ చైర్మన్ డాక్టర్ రవి, యూనివర్సిటీ వీసీ గంగాధరరావు, ప్రొఫెసర్ శివరామప్రసాద్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు హరీష్‌కుమార్, శాంతికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు హరీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ , కెరీర్ గైడెన్స్, కార్పొరేట్ వర్క్ కల్చర్ అనుభవాలను అందిస్తూ వారు ఉద్యోగాలు పొందేలా పూర్తి సహకారం అందిస్తామన్నారు.

## 'దూరవిద్య' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)లో ఆయా కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజౌల్లాఖాన్ కోరారు. 2025–26 విద్యా సంవత్సరం కోసం ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నామని ఆయన వివరించారు. బీఈడీ, ఎంబీఏ ప్రవేశ పరీక్ష ఆధారిత కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ సెప్టెంబర్ 17 వరకు అవకాశం ఉందన్నారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ పోర్టల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం హెల్ప్‌లైన్లు 040–23008463, 040–23120600, ఎక్స్‌టెన్షన్ 2207, 2208లలో సంప్రదించాలని సూచించారు.

## రశీదులు రాశారు.. కానీ రూ. 56 లక్షలు గోల్‌మాల్..!

**చందానగర్ సర్కిల్– 21లో సీఎస్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటం...?**

చందానగర్ : ఓ మహిళ కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటంతో లక్షల రూపాయలు గోల్‌మాల్ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందానగర్ సర్కిల్ 21లో సీఎస్‌సీ విభాగంలో ఔట్ సోర్సింగ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఓ మహిళ కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తుంది. గత సంవత్సరం 2024–2025గాను ఆస్తి పన్ను చెల్లింపులను సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌కు వచ్చి నగదు రూపంలో చెల్లించారు.ఆ సంవత్సరానికి సుమారు రూ.56 లక్షలు వచ్చాయి. ఆ మహిళ రశీదులు రాసింది. డబ్బును కార్యాలయంలోని క్యాషియర్‌కు ఇవ్వాలి. కానీ ఆమె ఇవ్వలేదు. ఐతే ఈ విషయం బయటకు రాకపోవడం విశేషం. తీరా ఆడిట్ అధికారులు చందానగర్ సర్కిల్ కార్యాలయంకు వచ్చి ఆడిట్ చేస్తే కానీ వెలుగులోకి రాలేదు. రూ.56 లక్షలు తక్కువ రావడంతో అధికారులు నివ్వెరపోయారు. ఈ విషయంలో ఆమెను నిలదీయగా వెంటనే కొంత డబ్బు బ్యాంకులో జమ చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో పలువురిపై ఆరోపణలు వెలువడుతున్న క్రమంలో ఆడిట్ అధికారులు, సిబ్బంది లోతుగా విచారిస్తున్నారు.

**ఆడిట్ రిపోర్ట్ వస్తే తెలుస్తుంది...**

సిటిజన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో జరిగిన రూ.56 లక్షల డబ్బుల గోల్‌మాల్ విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఆడిట్ అధికారులు సిబ్బందిని విచారిస్తున్నారు. రెండు రోజుల్లో ఆడిట్ రిపోర్ట్ వచ్చిన తరువాత పూర్తి వివరాలు బయటకు వస్తాయి. తదుపరి చర్యలు తీసుకుంటాం. –ఉపకమిషనర్ శశిరేఖ

చందానగర్‌లోని రాజేందర్‌రెడ్డినగర్‌లో.. పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి, కాలనీవాసులు



ఖాజాగూడలో కాటమయ్యయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



పటాన్‌చెరు: కుటుంబ సభ్యులతో కలిసి గణనాథునికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



# జై గణేశా జైజై గణేశా..

**వాడవాడలా కొలువుదీరిన గణనాథులు**

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌లలోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో గణేశ్‌లు కొలువుదీరారు. పూజలందుకుంటున్నారు. నవరాత్రుల్లో మొదటిరోజు బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్నా భక్తులు గణేశుడిని దర్శించుకున్నారు.
–శేరిలింగంపల్లి జోన్ బృందం



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో గణేశుడు



టెలికామ్‌నగర్‌లో..



ఖాజాగూడలో.. హనుమాన్ యూత్ అసోసియేషన్ పూజలు



గోపన్‌పల్లిలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ తదితరులు



రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి పూజల్లో విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు



రాయదుర్గంలో.. భారతీయ యువజన సంఘం ఆధ్వర్యంలో పూజలు

## గణేష్‌గడ్డలో వైభవంగా నవరాత్రోత్సవాలు



స్వామి వారికి హరిద్ర వర్ణ అలంకరణ



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు



రక్తవర్ణం అలంకరణలో..

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు గణేషుడు హరిద్ర వర్ణం లో, రెండోరోజు రక్తవర్ణంలో అలంకరించి పూజలు, హోమం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయంలో నిత్యాన్నదానం చేస్తున్నారు.

## నేత్రదానంపై అవగాహనా సదస్సు

చందానగర్ : జాతీయ నేత్రదాన వార్షికోత్సవంను పురస్కరించుకొని చందానగర్ గంగారంలోని వాసన్ ఐ కేర్ ఆసుపత్రిలో గురువారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ సుంకరి విజయ్, హాకీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌లు హాజరై మాట్లాడుతూ నేత్రదానానికి ముందుకు రావాలని, సామాజిక కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలన్నారు. అనంతరం వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు రతన్‌కుమార్ నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేశారు. 11 లక్షల మంది కార్నియల్ అంధత్వంతో చీకటిలో జీవిస్తున్నారన్నారు. 15 రోజుల పాటు ప్రజలకు నేత్రదాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ ప్రతినిధులు అరవింద్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ-ఏఆర్‌సీఐ ఒప్పందం




ఒప్పంద కార్యక్రమంలో హెచ్‌సీయూ- ఏఆర్‌సీఐ సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హెచ్‌సీయూలో పరిశోధన, బోధన, శిక్షణ, ఆవిష్కరణలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి గురువారం హెచ్‌సీయూ- ఏఆర్‌సీఐ (హైదరాబాద్‌కు చెందిన ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్)మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఇరు సంస్థల ప్రతినిధులు గచ్చిబౌలి లోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ విజయ్, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ సంతకాలు చేశారు. ముఖ్యంగా ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడం, ఎంటెక్, పీహెచ్‌డీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన అవకాశాలను అందించడం, వనరుల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడం, ఉమ్మడి ప్రచురణలు, పేటెంట్లు తదితర అంశాలపై ఇరు సంస్థలు దృష్టి సారిస్తాయి. ఈ సందర్భంగా రెండు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ఈ భాగస్వామ్యంతో భారతదేశ ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ జే గౌతమ్, హెచ్‌సీయూ ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఎల్ సబత్, ప్రొఫెసర్లు వివిఎస్‌ఎస్ శ్రీకాంత్, కెవి రాజులపలి, జి అప్పారావు, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

## పనులను వేగవంతం చేయాలి

**కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్**

మియాపూర్ : అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కృషినగర్ కాలనీ నుండి దీప్తిశ్రీనగర్ వెళ్లే రోడ్డులో రూ.43 లక్షల వ్యయంతో చేపట్టిన వరదనీటి కాల్వ పనులను చందానగర్ డివిజన్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

## ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బొల్లారం మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మధుసూదన్ రెడ్డి బదిలీపై ఇంద్రేశం మున్సిపాలిటీకి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## నియామకం



కిరణ్‌కుమార్

రాయదుర్గం: ఏఐసీసీ ఓబీసీ కాంగ్రెస్ పార్టీ ద్వారా ఓబీసీ ఐడియాలజికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి, ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా గురువారం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓబీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు.

## మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ఇద్దరికి రూ. 1500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

చందానగర్ : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని గురువారం చందానగర్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. కుత్బుల్లాపూర్ నిజాంపేట్‌కు చెందిన కృష్ణయ్య కుమారుడు సురేష్ (31) వ్యక్తిగత కారణాలతో చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ట్రాక్‌పైకి వచ్చాడు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే 100కు డయల్ చేయగా చందానగర్ పెట్రోలింగ్ పోలీసులు రైల్వే ట్రాక్ వద్దకు వచ్చి సురేష్‌ను అడ్డుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

## గృహిణి అదృశ్యం

చందానగర్ : ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందానగర్ పాపిరెడ్డి కాలనీ ఆరంభ టౌన్‌షిప్‌లో నివాసముండే పొదిలి వెంకటరావుకు 6 సంవత్సరాల క్రితం లావణ్య (31)తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెళ్ళి అయినప్పటి నుంచి భార్య భర్తలకు నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండు సంవత్సరాల నుంచి లావణ్య పుట్టింట్లో ఉంటుంది. పెద్దల సమక్షంలో వెంకటరావు భార్య లావణ్యను ఇంటి తీసుకువచ్చాడు. ఈ నెల 22వ తేదిన మధ్యాహ్నం 3.30 గంటలకు వెంకటరావు ఇద్దరు పిల్లలను స్కూల్ నుంచి తీసుకువచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉండడం గమనించాడు. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## లయన్స్ క్లబ్ చేయూత

చందానగర్ : చందానగర్ గంగారం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న విద్యా వాలంటీర్లకు లయన్స్ క్లబ్ గురువారం చేయూతనందించింది. వాలంటీర్ సీతా రాధికకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రెండు నెలల జీతం రూ.24వేలు అందించారు. వారికి ప్రతి నెలా స్వచ్ఛంద సంస్థల ద్వారా జీతాలు అందజేయడం జరుగుతుందని, ఈ మేరకు లయన్స్ క్లబ్ ముందుకు వచ్చి వాలంటీర్లకు జీతం అందించడం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్ మల్లేష్, మారం ప్రసాద్, బస్వరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భీమమ్మ, ఉపాధ్యాయ కమిటీ నరహరి తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన విష్ణు కీర్తనం



మాదాపూర్: కళాకారులు తమ ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో వినాయక చవితి సందర్భంగా మంగళవారం సుమేధ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గురువు అరుంధతి షెనాయ్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, వినాయకకౌతం, జతిస్వరం, అలరిపు, విష్ణుకీర్తనం, దుర్గ కీర్తనం, కృష్ణకీర్తనం , మంగళం తదితర అంశాలను కళాకారులు లలిత, జనిత్రి, సాయిసంహిత, అవని, ఆద్య, ధృతి, దిశ, యశస్విని, ఇషిత, శ్రీనిక, సంహిత అహానా తదితరులు ప్రదర్శించారు.

## నిమజ్జనాలను ప్రణాళిక ప్రకారం చేయాలి

**జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్**

గచ్చిబౌలి: గణేష్ నిమజ్జనాలను ప్రణాళికతో పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్‌బోర్ఖడే అధికారులకు సూచించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నిమజ్జన కోనేర్లు, చెరువులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా దుర్గంచెరువు, మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు,సాకి చెరువులను ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. గంగారం చెరువు చుట్టూరా నివాసిత ప్రాంతాలలో డెంగ్యూ కేసులను గుర్తించడం జరిగిందని, నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ అధికారులకు ఆయన ఆదేశించారు. ఎప్పటికప్పుడు నివేదికను ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలకు పంపాలన్నారు. గంగారం చెరువులో సిల్టింగ్‌ను యుద్ధప్రాతిపదికన తొలగించాలని, చెరువు నుంచి తీసిన గుర్రపుడెక్క తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని, వారంలోపు పని పూర్తి చేయాలని సంబంధిత అధికారుల కు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డార్క్‌స్పాట్స్ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు .రోడ్లపై పాట్ హోల్స్ లేకుండా వెంటనే పూడ్చాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్, లేక్స్, ఇంజనీరింగ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్‌బోర్ఖడే

**చందానగర్ సర్కిల్ పరిధిలో..**

చందానగర్ : చందానగర్ సర్కిల్ పరిధిలో కోనేరు, చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఉప కమిషనర్ శశిరేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నిమజ్జనం కోసం 6 పాయింట్‌లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం నుంచి గణేష్ నిమజ్జనాలు ప్రారంభం అవుతాయని తెలిపారు.